# అర్థంకాని మనిషి




నవంబర్ ఒకటి, సెలవు.

అలవాటు కొద్దీ ఉదయం పదిగంటలు అవకముందే భోజనం ముగించి వరండాలో కూర్చుని వో కథను ఫెయిర్ చేస్తున్నాను.

మధ్యగదిలో పడుకుని ఏదో నవల చదువుకుంటున్నది వసుంధర.

ఎండ పల్చగా వుంది.

రాస్తున్న వాడినల్లా గేటు నెట్టిన చప్పుడు వినిపించి తలెత్తి చూశాను. నవ్వుతూ లోపలకు

వచ్చిన పోస్ట్‌మేన్ నా చేతికి ఓ కవరందించి వెళ్లిపోయాడు.

విప్పాను.

ఆ ఉత్తరం పేరిందేవి దగ్గరనించి. మరురోజు కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో వస్తోందిట. స్టేషన్‌కు రమ్మని రిక్వెస్ట్.

"ఎవరినించీ ఉత్తరం?" వచ్చి అడిగింది వసుంధర.

"పేరిందేవి నించి" చెప్పాను.

"పేరిందేవి ఎవరు?" అడిగింది మళ్లీ.

"నీకు తెలీదు. డిగ్రీలో నా క్లాసుమేటు. ఇప్పుడు హైద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది" అని పేరిందేవి వస్తున్న విషయాన్ని చెప్పాను.

ఇంకేమీ అడక్కుండా లోపలకు వెళ్లింది వసుంధర.

ఇక కథను ఫెయిర్ చెయ్యలేకపోయాను. నా ఆలోచనలన్నీ పేరిందేవి గురించే.

ఆమె చాలా చిత్రమయిన మనిషి. ఆమెను మొదట్లో నేను ఎంతగానో అర్థంచేసుకున్నానని అనుకున్నాను. అలా అనుకుని ముందుకు వెళ్లటానికి ప్రయత్నించిన నేను ఎదురుదెబ్బ తినక తప్పలేదు. నిజానికి ఆ దెబ్బను తిన్న తర్వాతనే నాకు పేరిందేవి ఎంతమాత్రమూ అర్థంకాలేదన్న విషయం బోధపడింది.

నా దృష్టిలో పేరిందేవి అర్థంకాని మనిషి.

చదువుకునే రోజుల్లో పేరిందేవి ఒంటరిగా ఓ గదిలో వుండేది. మొదటిసారి ఆమె గదికి ఓ నోట్సుకోసం వెళ్లినప్పుడు పేరిందేవి మాటలు నన్ను పెడదారి పట్టించాయి. ఆమె మాటలను సరిగా అర్థంచేసుకోని నేను–

"ఒక్కసారి గది తలుపులను మూసెయ్యి పేరిందేవీ" అన్నాను.

"ఎందుకు?" అనడిగింది.

"పనుంది. ముందు ముయ్యి"

"నీ ఉద్దేశం నాకు తెలుసు. నన్ను నీ దాన్నిగా చేసుకునే ఆలోచన వుంటేనే ఇలాంటి పిచ్చివేషాలు వెయ్యి" నవ్వుతూనే అన్నది.

నాకేమీ అర్థంకాలేదు. పిచ్చిగా బయటకు చూశాను. కొన్ని క్షణాలు మా ఇద్దరి మధ్యనా నిశ్శబ్దం.

"ఐనా నీకీ దారుణమైన ఆలోచన ఎలా కలిగింది? నీ కళ్లకు నేను అంత చీప్‌గా కనపడుతున్నానా?" అడిగింది తర్వాత.

"నీ మాటలు... ఈ గది– ఈ ఒంటరితనం నన్ను ఉత్తేజితుడిని చేశాయి"

నాకే గిల్టీగా వుంది. పేరిందేవి ఎదుట అలా ప్రవర్తించినందుకు.

"నామీద ఎంత నమ్మకం లేకపోతే నా తల్లిదండ్రులు ఈ గదిలో వొంటరిగా వుంచి నన్ను చదివిస్తారనుకున్నావ్?" నిలదీసినట్టు అనిపించింది.

నాకు మౌనమే శరణ్యం.

"నువ్విలా అడగటానికి కారణం నేను, నా మాటలే ఐతే క్షమించు"

అక్కడ నిలవలేక పోయాను. చివుక్కున నిల్చున్నాను. అప్పటికి నన్ను నేను సమర్ధించుకునే ప్రయత్నంలో వున్నాను. కాబట్టి ఆమె మనసును నొప్పించినందుకు కనీసం సారీ అయినా చెప్పకుండా బయటకు వచ్చేశాను.

మళ్లీ పేరిందేవిని కలవకూడదనే అనుకున్నాను. కాని నన్న మరింత నీచుడికింద జమకడుతుందనీ, కేవలం ఆమె పొందు కోసమే తనతో స్నేహం పెంచుకున్నానని అనుకుంటుందనీ, తర్వాత కొన్ని రోజులకు ఆమె గదికి వెళ్లాను. మామూలుగానే ఆహ్వానించింది.

"నేను నిన్ను ఇలా అడిగినట్లు మీ ఫ్రెండ్సుతో చెప్పావా?" అడిగాను.

"ఎందుకు చెబుతాను?"

" ఓ మగాడు నన్నిలా అడిగాడని చెప్పుకోవడం గొప్పకదూ?"

"కానీ వినేవాళ్లు నావైపునించి ఆలోచిస్తే?"

"అంటే?"

"నువ్వలా అడగటానికి నా ప్రవర్తనే కారణం అని అనుకుంటే"

అంతదూరం నేను ఆలోచించలేదు. ఏమయినా పేరిందేవిని అర్ధంచేసుకోవటం చాలా కష్టమనిపించింది.

డిగ్రీ పూర్తయిన తర్వాత హైదరాబాద్‌లో నాకు ఓ చిన్న ఉద్యోగం వచ్చింది. పేరిందేవి అక్కడే వుండి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. మా ఇద్దరి మధ్య ఉత్తరాలు జోరుగానే సాగుతున్నాయి.

ఒకరోజు రాత్రి ఎనిమిది గంటలు దాటుతున్నప్పుడు వున్నట్టుండి నా గదికి వచ్చింది పేరిందేవి.

"ఏమిటిలా వూడిపడ్డావ్?" నవ్వుతూ అడిగాను.

"రేపు ఓ ఉద్యోగానికి ఇక్కడ ఇంటర్వ్యూకి పిలిచారు. పోస్టల్ డిలే. ఈరోజు ఉదయమే ఇంటర్వ్యూ కార్డు అందింది. వెంటనే బయల్దేరాను"

ఓ గంట వరకూ కబుర్లు చెబుతూనే వుంది పేరిందేవి. తర్వాత నేను వెళ్లి హోటలునుంచి

ఇద్దరికీ భోజనం తీసుకు వచ్చాను.

తనే వడ్డించింది.

భోజనం చేస్తున్నంతసేపూ ఆలోచిస్తూనే వున్నాను.... ఆరాత్రి పేరిందేవి- నేను ఆ గదిలోనే పడుకోవాలి... ఎలా??

పదకొండున్నర దాటింది.

"నేను బయట పడుకుంటాను" అన్నాను.

"ఇంత చలిలో బయటపడుకుని బతకాలనేనా? నీకేం భయంలేదు. ఈ రాత్రి నిన్నేమీ చెయ్యనని హామీ ఇస్తున్నాను. ఇక్కడే పడుకో... అనవసరంగా భయపడకు" అన్నది నవ్వుతూ-

ఏం మాట్లాడాలో తోచలేదు. పేరిందేవి అలా మాట్లాడుతుందని అనుకోలేదు.

పడుకున్నాను.

ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. ఏవో ఆలోచనలు. ఆ గదిలో నా పక్కనే ఓ వయసులో వున్న ఆడది పడుకున్నదనే ఆలోచన నన్ను నిద్రకు దూరంగా తరిమివేస్తోంది.

నా అవస్థను గమనించినట్టు, "సారీ... నందనరావ్...నాకు తెలుసు నీ బాధ... పక్కనే అమ్మాయిని వుంచుకుని నిద్రపోగలగటం కష్టమే... ఈ ఒక్కరాత్రి ఎలాగో గడిపెయ్" అన్నది పేరిందేవి.

నిజంగా షాక్...

నా ఆలోచనలను పేరిందేవి అలా చదివెయ్యటం భరించలేకపోయాను.

చివరకు ఎలాగో, ఎప్పటికో నిద్రపోయాను.

మెలకువ వచ్చేసరికి తెల్లవారింది. పేరిందేవి అప్పటికే స్నానం చేసింది. కాఫీ తయారు చేస్తోంది.

మొహం కడుక్కుని వచ్చాను. కాఫీ కప్పును చేతికి ఇచ్చింది.

తాగుతున్నాను.

"నీ దురదృష్టానికి నాకు బాధగా వుంది రావ్" అన్నది.

"వయసులో వున్న ఆడదాన్ని ఓ రాత్రంతా పక్కనే వుంచుకుని ఏమీ పొందలేకపోవడం దురదృష్టం కాకమరేమిటి?"

దారుణం పేరిందేవీ!! నా చేతిలో కప్పుజారి కింద పడబోయింది.

ఇలాంటి మనిషి పేరిందేవి.

అనుక్షణం ఆమెను అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తూనే వున్నాను. కానీ అది విఫల

ప్రయత్నమే అవుతోంది.

తర్వాత నాకు గుంటూరులోనే ఉద్యోగం వచ్చింది. పేరిందేవికి హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. నేను భాగ్యనగరాన్ని వదలడం, పేరిందేవి చేరుకోవడం ఒకేసారి జరిగాయి.

మళ్లీ ఇద్దరి మధ్య ఉత్తరాయణం.

పేరిందేవిని పెళ్లి చేసుకుని అయినా అర్థం చేసుకోవాలని అనుకున్నాను. కాని ఆమె నాకు అలాంటి అవకాశాన్ని ఇవ్వలేదు.

"నీ జీవితాన్ని పంచుకునే అవకాశాన్ని నాకు కలిగించినందుకు కృతజ్ఞతలు. సారీ... కానీ ఇప్పుడు నాలో ఆ ఉద్దేశం లేదు" అని జవాబు రాసింది.

తర్వాతనే నా పెళ్లి వసుంధరతో నిశ్చయమయింది.

పేరిందేవికి నా పెళ్లి శుభలేఖను పంపాను. కాని ఆమె పెళ్లికి రాలేదు. రాలేకపోయినందుకు తనని క్షమించమంటూ ఉత్తరం రాసింది.

ఆమె రాసిన చివరి ఉత్తరం అదే. తర్వాత ఎందువల్లనో నాకు ఉత్తరాలు రాయలేదు.

మళ్లీ అప్పుడే రాయడం-

మరురోజు కృష్ణాఎక్స్‌ప్రెస్ వచ్చేటైముకు రైలు స్టేషన్‌కు వెళ్లాను. నా అదృష్టం కొద్దీ సరయిన టైమ్‌కే వచ్చింది ఆ రైలు.

కళ్లకు నల్లని పెద్ద పెద్ద కూలింగ్ గ్లాసెస్‌తో దిగింది పేరిందేవి.

"హల్లో నందనరావ్" నవ్వుతూ విష్ చేసింది.

నేనూ విష్ చేశాను.

"వస్తావనే అనుకున్నాను" నడుస్తూ అన్నది.

బయటకు వచ్చాం.

ఆటో మాట్లాడాను.

కూర్చున్నాం. కదిలింది ఆటో.

"ఇప్పుడు చెప్పు... ఏమిటీ అర్థంతర రాక?"

"రెండు పనులమీద వచ్చాను. ఒకటి - నా పెళ్లి విషయం నీతో స్వయంగా చెప్పటానికి. రెండు- ఇక్కడ జన్రల్ హాస్పిటల్లో వున్న మా బంధువొకామెను చూడటానికి"

"నీ పెళ్లా!" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును"

"ఎప్పుడూ?"

"ఓ పదిహేను రోజుల్లో"

ఓవర్ బ్రిడ్జి మీదనించి వెళుతోంది ఆటో.

"ఎరేంజ్డ్ మ్యారేజా?"

"కాదు. లవ్ మ్యారేజ్"

"కంగ్రాచ్యులేషన్స్"

"థాంక్యూ రావ్"

ఆటో ఇంటిముందాగింది. ఫేర్ చెల్లించాను. చప్పుడు విని బయటకు వచ్చింది. వసుంధర, పేరిందేవిని పరిచయం చేశాను. నవ్వుతూ తనతో లోనికి తీసుకు వెళ్లింది వసుంధర.

"నందనరావ్ అదృష్టవంతుడు" అన్నది పేరిందేవి.

"ఎందుకు?" అడిగింది వసుంధర.

"మీలాంటి అందమయిన భార్య దొరికినందుకు"

సిగ్గుపడింది వసుంధర.

నేనేదో అడగబోయేను.

"ఉండు బాబూ... నీ సందేహాలు తర్వాత తీర్చుకుందువుగాని... నాకు ఆకలి దంచేస్తోంది" అన్నది పేరిందేవి.

"మీరు బాత్రూంకి వెళ్లిరండి... ఈ లోపున నేను వడ్డిస్తాను" అన్నది వసుంధర బాత్‌రూం చూపుతూ.

ఇద్దరూ అక్కడినించి వెళ్లారు.

ముందు గదిలో ఒక్కడినే కూర్చున్నాను.

పైన ఫేన్ మెల్లగా తిరుగుతోంది. తిరుగుతూ చిన్నగా చప్పుడు చేస్తోంది.

పేరిందేవికి పెళ్లి కాబోతున్నందుకు నాకు సంతోషంగా అనిపించింది. అతనయినా ఆమెను అర్థం చేసుకోగలిగాడు.

వంట గదిలోనించి మాటలు, మధ్యలో నవ్వులూ వినిపిస్తున్నాయి.

ఈ ఆడవాళ్లు ఎంత చిత్రమయిన వాళ్లు! నిమిషంలో ఎంతో సన్నిహితులుగా మారిపోతారు.

ముందు పేరిందేవి వచ్చింది గదిలోనించి.

"నీ భార్య వంటకూడ బావుంది. లక్కీ ఫెలోవి. రేపు ఆయన నా వంటతిని ఎంతవరకు బతుకుతాడో" అన్నది నవ్వుతూ పేరిందేవి.

"ఇంతకీ అతనేం చేస్తున్నాడు? ఎలా వుంటాడు? అసలు మీ ఇద్దరికీ ఎలా పరిచయం

అయ్యింది?" గబగబా అడిగాను.

"చంపకు- నిదానంగా చెబుతాను. ఓ బ్యాంకులో పరిచయం అయింది. ఆయన ఆ బ్యాంకులోనే పనిచేస్తాడు. నా కళ్లకు అందంగానే వుంటాడు- సరిపోతాయా ఈ వివరాలు??" అన్నది.

అప్పటికే వంటిల్లు సర్ది వచ్చిన వసుంధర- పేరిందేవి మాటలకు నవ్వింది.

సాయంత్రం వరకూ మా ఇంట్లోనే వున్నది పేరిందేవి. తర్వాత బయల్దేరింది. బలవంతం చేసినా వుండలేదు. జన్రల్ హాస్పిటల్‌లో వాళ్ళ బంధువుని చూసి అటునించే తను హైదరాబాద్‌కు వెళ్లిపోతానన్నది. వెళ్లగానే శుభలేఖను పంపుతాననీ, ఐదారురోజుల ముందుగానే మా ఇద్దరినీ పెళ్లికి రమ్మని ఆహ్వానించింది.

సరేనన్నాను.

పేరిందేవి అంత త్వరగా వెళ్లినందుకు నాభార్య కూడా బాధపడింది. నా భార్యను పేరిందేవి బాగా ఆకర్షించింది.

నేను ముందుగానే లీవ్‌కు అప్లయి చేశాను.

అప్పటికి పేరిందేవి మా ఇంటికి వచ్చి వెళ్లి వారం రోజులు దాటిపోయింది. కాని ఇంతవరకు ఆమెనుంచి పెళ్లి శుభలేఖ రాలేదు.

ఎందువల్లనో తెలీదు.

వసుంధర కూడా నన్ను ఈ విషయం గురించే అడుగుతోంది.

కారణం ఏమయివుండాలి?

కార్డు మిస్సయి వుంటుందా?

ఏమో!

మేమిలా అనుకుంటూ వుండగానే ఓరోజు నేను ఆఫీసునించి రాగానే పేరిందేవి దగ్గర్నించి వచ్చిన ఉత్తరాన్ని నా చేతికిచ్చింది వసుంధర.

గబగబా ఉత్తరం మడత విప్పాను.

డియర్ నందనరావ్-

మీరు నా పెళ్లి శుభలేఖ కోసం ఎదురు చూస్తూ వుంటారని నాకు తెలుసు. కానీ ఈ ఉత్తరం నీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. మూడు రోజుల క్రితం రాత్రి పదిగంటలు దాటుతున్నప్పుడు మావూర్నించి నా గదికి వచ్చాను. అప్పుడు వచ్చాడు శ్రీపతి- నాక్కాబోయే భర్త. నన్ను కోరాడు. పెళ్లయ్యేవరకూ ఆగమన్నాను. విన్లేదు. అప్పటికే నామీద తనకు అధికారం సంక్రమించినట్టు చొరవ తీసుకోబోయేడు. ఓ చెంపదెబ్బతో బయటకు పంపాను.

సో... ఇహ నా పెళ్లి జరగదు... క్షమాపణలతో

పేరిందేవి

ఆ ఉత్తరాన్ని చదివి చాలాసేపు రాతిబొమ్మలా వుండిపోయాను. ఏమిటీ పేరిందేవి ధైర్యం? చివరివరకూ వచ్చిన పెళ్లిని చెడగొట్టుకుంది. మళ్లీ పేరిందేవిని అర్థంచేసుకునే ప్రయత్నం చేశాను.

ఐతే- ఈసారి నేను ఎప్పటిలా అసంతృప్తిని ఫీలవలేదు. ఎందుకంటే? నాకేకాదు- మరో మనిషికి కూడా పేరిందేవి అర్థం కాలేదనే విషయం తెలిసింది. అదే నాకు తృప్తి. ఒకటి మాత్రం నిజం. పేరిందేవి తనకు తనే అర్థంకాని మనిషి.

(23 -4-1979 ఆనందజ్యోతి వారపత్రికలో ప్రచురితం)